# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో 2 రోజులపాటు జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ ఈ రోజు ప్రారంభిస్తారు.**
2. **విశాఖపట్నంను సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఈ రోజు జరగనుంది.**
4. **ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యార్థులకు నీట్, ఐఐటీకి ఉచిత శిక్షణ అందజేయనున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు.**
5. **భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడుల సాధనే లక్ష్యంగా భారత పరిశ్రమల సమాఖ్య, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ రోజు, రేపు భాగస్వామ్య సదస్సు జరగనున్నది. "టెక్నాలజీ , ట్రస్ట్, నావిగేటింగ్ ది న్యూ జియో ఎకనామిక్ ఆర్డర్" ఇతివృత్తంతో జరుగనున్న ఈ సదస్సును ఉప రాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు దాదాపు నలభైకి పైగా దేశాలకు చెందిన ప్రతినిధులు, అంతర్జాతీయ విధాన రూపకర్తలు, వ్యాపార ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ముఖ్యమంత్రి గత సాయంత్రం విడుదల చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, భవిష్యత్ ఆర్థిక శక్తిగా ఆంధ్రప్రదేశ్ మారేలా 9 జిల్లాలతో విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సదస్సుకు ముందే రాష్ట్ర ప్రభుత్వం 2.66 లక్షల కోట్ల రూపాయల మేర అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30సెకన్లు

---------------------------

విశాఖ పెట్టుబడుల సదస్సుకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్నంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, సదస్సుకు వచ్చేవారి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తుందని తెలిపారు. సుమారు 3 వేల 500మంది పోలీసులతో రక్షణ ఏర్పాట్లు చేపట్టామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు ఈ రోజు జరగనుంది. కౌంటింగ్ కోసం హైదరాబాద్ యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తెలిపారు. హైదరాబాద్ లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుందని మొదటగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లను లెక్కించిన., అనంతరం ఈవీఎంల ఓట్ల లెక్కింపు జరుగనుందని చెప్పారు. 10 రౌండ్స్ లో ఈవీఎంల ఓట్ల లెక్కింపును పూర్తి చేసేలా ఏర్పాట్లు చేశామని తెలుపుతూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గురుకులాల్లో విద్యనభ్యసిస్తూ, పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నీట్, ఐఐటీకి ఉచిత శిక్షణ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత వెల్లడించారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని ఈ మేరకు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణ అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

---------------------------

భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా ఈరోజు జరుపుకుంటున్నాం. ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో 1889 నవంబర్ 14న ఆయన జన్మించారు. లండన్‌లో న్యాయ విద్యను అభ్యసించిన అనంతరం అలహాబాద్‌లో న్యాయవాద వృత్తిని చేపట్టినప్పటికీ, జాతిపిత మహాత్మాగాంధీ ప్రేరణతో జాతీయోద్యమంలో ప్రవేశించి పలుమార్లు జైలు జీవితం గడిపారు. స్వాతంత్ర్యానంతరం 1947 ఆగష్టు 15వ తేదీన ఏర్పడిన జాతీయ ప్రభుత్వంలో ఆయన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

---------------------------

'సదరం' ధృవీకరణ పత్రం స్లాట్ల బుకింగ్ ఈరోజు నుంచి పునఃప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. సాంకేతిక కారణాలతో గత సెప్టెంబరు నుంచి నిలిచిపోయిన స్లాటు బుకింగ్ లు డిసెంబరు నెలాఖరు వరకు కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు స్లాట్ బుకింగ్, ధృవీకరణ పత్రం ముద్రణకు 40 రూపాయలు చొప్పున వసూలు చేసే రుసుమును రద్దు చేశామని

మంత్రి తెలిపారు. సదరం కింద సామాజిక ఆసుపత్రుల్లో ప్రతి సోమవారం, ప్రాంతీయ, జిల్లా, బోధనాసుపత్రుల్లో ప్రతి మంగళవారం దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ షెడ్యూల్ ను విద్యా శాఖ విడుదల చేసింది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ పరీక్షకు ఈరోజు నోటిఫికేషన్ విడుదల చేస్తామని. రేపటి నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నామని అధికారులు తెలిపారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించిన..విద్యా శాఖ జులై 22న ఫలితాలు వెల్లడించింది.

---------------------------

జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని బాపట్ల జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని బాపట్లలో నిర్వహించిన ఐక్యతా ర్యాలీని కలెక్టర్ నిన్న ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం తరువాత రాజ సంస్థానాలను ఏకం చేసి, ఆధునిక భారతదేశాన్ని నిర్మించారన్నారు.పటేల్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో చలి తీవ్రత పెరుగుతోందని కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణాకేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, నంద్యాల జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల లోపు నమోదవుతున్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.6 డిగ్రీలసెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగ మంచు కురుస్తుండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తెలంగాణలోనూ చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, రాజన్నసిరిసిల్లలో అత్యంత కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ– ఐటీడీఏ లక్ష్యమని చింతూరు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి తులసి అన్నారు.భగవాన్ బిర్సా ముండా 150వ జయంతోత్సవాలను పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో నిర్వహించిన గ్రామసభలో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసి మాట్లాడుతూ, ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం కింద గ్రామ పంచాయితీ అభివృద్ధికి 5 ఏళ్ల ప్రణాళిక రూపొందించామన్నారు. గిరిజనుల చరిత్ర, సంస్కృతిని తెలియజేస్తూ పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

రానున్న 2027 గోదావరి పుష్కరాలను సమర్థంవంతంగా నిర్వహించడానికి మౌలిక సదుపాయాల కల్పన పనులపై అంచనాలు రూపొందించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో పుష్కరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రాథమిక సమీక్ష సమావేశాన్ని నిన్న నిర్వహించారు.

======================